చివరి ఆయకట్టుకు అందని నీరు

● అధ్వానంగా పాకాల నరస్సు కాల్వలు
● మరమ్మతులు చేయించని అధికారులు


సంగెం-4 కాల్వ కింద నీరందక ఎండిపోతున్న వరి

ఖానాపురం: ధాన్యాగారానికి ప్రధాన నీటి వనరు పాకాల. ఈ సరస్సులో నీటిమట్టం 30.3 ఫీట్లకు చేరుకుని మత్తడి సైతం పోసింది. పంటలకు ఢోకా లేదని అన్నదాతలు ఆనందపడ్డారు. వర్షాలు పడుతున్న సమయంలో నాట్లు వేసుకున్నారు. కానీ, కాల్వలు అస్తవ్యస్తంగా ఉండడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. దీంతో రైతులు వర్షం కోసం చూస్తున్న పరిస్థితి నెలకొంది. మండలంలోని ధర్మరావుపేట శివారులో సంగెం-4 కాల్వ కింద రైతులు వరి పంటలు సాగు చేసారు. వర్షాలు పడుతున్న సమయంలోనే నాట్లు వేసుకున్నారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో పాకాల సరస్సులోకి భారీగా నీరు చేరుకుని నిండుకుండలా మారింది. ప్రస్తుత ఖరీఫ్‌తోపాటు రబీలోనూ పంటలకు నీరందుతుందని రైతులు ఆనందపడ్డారు. సంగెం-4 కాల్వ అధ్వానంగా ఉండడంతో ధర్మరావుపేట శివారులో బోరింగ్ బుర్ర వరకు మాత్రమే నీరు కొద్దిగానే వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. చివరి ఆయకట్టుకు నీరు అందకపోవడంతో పొలాలు నెర్రెలు వారుతున్నాయి. చివరి ఆయకట్టు వైపు ఉన్న కాల్వను ఇరిగేషన్ అధికారులు ఒక్కసారి కూడా పరిశీలించలేదని ఆరోపణలు వస్తున్నాయి. తలాపున నీళ్లు ఉన్నా వర్షం కోసం ఎదురుచూడాల్సి వస్తోందని చివరి ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇలానే పరిస్థితి కొనసాగితే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికి రాక ముందే వదిలేయాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వలు మరమ్మతులు చేయించి పంటలకు నీరందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నాలుగున్నర ఎకరాలు సాగు చేసిన



సంగెం-4 కాల్వ కింద సుమారు నాలుగున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరిపంట సాగు చేశాను. కానీ, కాల్వ బాగా లేక చివరి ఆయకట్టులోని వరి పంటలకు నీరు అందడంలేదు. సంబంధిత అధికారులు కూడా కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. అధికారులు కాల్వను మరమ్మతు చేసి చివరి ఆయకట్టుకు నీరందించాలి. **- కత్తాల వెంకటేశ్వర్‌రావు, ధర్మరావుపేట**

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


శ్రీనివాసరావు

వర్ధన్నపేట : వర్ధన్నపేట సీఐగా కొమ్ము్మరి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సీఐ సూర్యప్రకాశ్‌ను హైదరాబాద్‌లోని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలని కోరారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్రావణ్‌కుమార్



రాయపర్తి: బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలకేంద్రానికి చెందిన ఎనగందుల శ్రావణ్‌కుమార్‌ను నియమించినట్లు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఏబీవీపీలో చురుకుగా పని చేసినందుకుగాను తనపై నమ్మకంతో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినట్లు తెలిపారు.

నియామకం

పర్వతగిరి : బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు నియామకమయ్యారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇంటి ఆవరణలో బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేసి, రాజేశ్వర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోనె సంపత్, బూర శ్యామ్, దర్నోజు దేవేందర్, ఏర్పుల శ్రీనివాస్, చింతల శ్రీనివాస్, ఎస్‌కె.షబ్బీర్‌అలీ, యాకయ్య, పరమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



చెన్నారావుపేట : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు ఓం ప్రకాష్ ఆచారి, ఎస్సై గూడ అరుణ్, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి, మాజీ ఎంపీపీ జక్క అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులుతో ఈ నెల 26 నుంచి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. జల్లీలో 29వ తేదీ వరకు, ఎల్లాయగూడెంలో సెప్టెంబర్ 2వ తేదీ వరకు వేడుకలు జరుగుతాయన్నారు.

భారత్ బంద్ విజయవంతం



నర్సంపేట : ఎస్సీ ఉప వర్గీకరణ చేసుకునే వెసులుబాటును రాష్ట్రాలకు కల్పిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ కోర్టు నిర్ణయాల్లో రాజకీయ జోక్యాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం దేశవ్యాప్తంగా దళిత సంఘాలు చేపట్టిన భారత్‌బంద్‌లో భాగంగా నర్సంపేట పట్టణంలో దళిత సంఘాల నాయకులు విద్యా సంస్థలు బంద్ చేయించారు. ఈ సందర్భంగా జాతీయ మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల రవి మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ జరుగకుండా వర్గీకరణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కార్యక్రమంలో బొల్లెపల్లి కమల్, నల్ల రవి, సతీష్, రాజేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్, సూర్యపేట తండా, అక్కల్‌చెడ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పంపిణీ చేశారు. అమీనాబాద్‌కు చెందిన నడిగట్టు మార్త, సాయిరాజు, బానోత్ భద్రు, అక్కల్‌చెడలోని కట్టయ్యపల్లికి చెందిన బొంత చిన్నసమ్మక్క, సూర్యపేట తండాకు చెందిన ధరావత్ బుజ్జి, ధరావత్ రవి, ఈనియా, కిషన్‌లకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, మాజీ సర్పంచ్ ధరావత్ కిషన్, భద్రు నాయక్ చెక్కులు అందించారు.

విద్యార్థులకు టీ షర్ట్స్..



నర్సంపేట రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జేడీ ఫౌండేషన్ కన్వీనర్ పింగిలి కవిత రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని మాధన్నపేట జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు రామచంద్రు అధ్యక్షతన కవితరెడ్డి, గణిత ఉపాధ్యాయురాలు సుధావాణిలు ఉచితంగా టీ షర్ట్స్ పంపిణీ చేశారు. కృష్ణమూర్తి, మహేందర్‌రెడ్డి, చంద్రమౌళి జేడీ ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

‘హామీల అమలులో కాంగ్రెస్ విఫలం’

నర్సంపేట : ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు అన్నారు. ఈ మేరకు పట్టణంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ ఒక్క పథకం నర్సంపేట నియోజకవర్గంలో అమలు కాలేదన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు, తులం బంగారం అందించలేదన్నారు. ఆడబిడ్డల తల్లిదండ్రులు అప్పులు చేసి పెళ్లి చేసి నెలల తరబడి ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా దీవెన పథకం, నిరుపేద మహిళలకు పక్కా ఇళ్లు, మహాలక్ష్మి పథకం కింద రూ.2,500, వితంతు పింఛన్ పెంపు జరగలేదన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే అర్హులైన ప్రతి ఒక్కరికీ కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి వారి ఆర్థిక పురోగతికి తోడ్పాటును అందించాలని కోరారు.

చంద్రశేఖర్ బినామీ కాదు

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి : చిదురాల చంద్రశేఖర్ తనకు బినామీ కాదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. చంద్రశేఖర్ ద్వారా తన కుమారుడు ప్రేమ్‌చందర్‌రావు భూమి కొనుగోలు చేసిన విషయం వాస్తవమేనని, చంద్రశేఖర్‌రావు ఆన్‌లైన్ టెండర్ ద్వారా భూమి కొనుగోలు చేశామని తెలిపారు. అనంతరం చంద్రశేఖర్ భూమిని చట్టబద్ధంగానే కొనుగోలు చేశామని పేర్కొన్నారు.

లక్ష్మీనృసింహుడికి సీఎం ఓఎస్డీ పూజలు


పూజలు చేస్తున్న ఓఎస్డీ కుటుంబ సభ్యులు

గీసుకొండ: మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓఎస్డీ వేముల శ్రీనివాస్ దంపతులు, వారి కుటుంబ సభ్యులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు. వేముల శ్రీనివాస్ స్వామివారికి తన మనవడి పుట్టు వెంట్రుకలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇష్టదైవం నర్సింహస్వామి అని, ప్రతి ఏడాది స్వామివారిని దర్శించుకుంటానని అన్నారు. ఓఎస్‌డీ దంపతులకు ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి, కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, ఆకుల రుద్రప్రసాద్, కొండేటి కొమురారెడ్డి తదితరులు స్వాగతం పలికారు. తహసీల్దార్ రియాజుద్దీన్, ఆర్ఐ సాంబయ్య పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



బురదమయంగా రోడ్డు

మండలంలోని పాత మగ్దుంపురం గ్రామంలో మట్టిరోడ్డు బురదమయంగా మారి నడిచేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. చినుకు పడితే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు, నాయకులు సీసీ రోడ్డు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **- చెన్నారావుపేట**

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
మహ్మద్ షంషొద్దీన్ పంచాయితీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 84990 48709

నిందితులను కఠినంగా శిక్షించాలి

నర్సంపేట : కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేషం డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) అనుబంధ మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేషం మాట్లాడుతూ మహిళా వైద్యురాలిపై జరిగిన అమానుష ఘటనను సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆస్పత్రుల్లో, మెడికల్ కాలేజీల్లో పని చేసే వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించేలా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఖానాపురంలో చోరీ

● బంగారు ఆభరణాల అపహరణ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రఘుపతి

ఖానాపురం : మండల కేంద్రంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొత్తపల్లి లత-క్రాంతికుమార్ రోజుమాదిరిగానే పనులకు వెళ్లారు. ఈ క్రమంలో వారి కుమార్తె మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా జ్వరం వచ్చిందనే విషయాన్ని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు తెలిపారు. కాగా తల్లి లత పాఠశాలకు వెళ్లి కుమార్తెను స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం చేయించి ఇంటికి తీసుకువచ్చారు. మధ్యాహ్న సమయంలో ఇంటి తాళం పగులకొట్టి తలుపులు తెరిచి ఉండటంతో ఆందోళన చెంది ఇంట్లోకి వెళ్లి చూడటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో ఉన్న 2.5 గ్రాముల కమ్మలు, 2.5 గ్రాముల మాటీలు, 2.5 గ్రాముల రింగులు, 2.5 గ్రాముల ఉంగరం, 15 తులాల పట్టీలు, రూ.10వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. కాగా లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


పర్వతగిరి: పరామర్శిస్తున్న దయాకర్‌రావు


ఖానాపురం: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన చిదురు రాజమ్మ బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. కాగా రాజమ్మ మృతదేహంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. చింతపట్ల మాలతిసోమేశ్వర్‌రావు, మనోజ్‌గౌడ్, రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నర్సంపేట రూరల్ : మండలంలోని మాధన్నపేటకు చెందిన గౌర్రె వెంకటమ్మ, శారద వారి కుమారుడి ఇళ్లతో పాటు సామగ్రి షార్ట్ సర్క్యూట్‌తో కాలిబూడిదయ్యాయి.ఈ సందర్భంగా మాధన్నపేట యువ పటేల్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.5వేలు, రాము రైస్ మర్చంట్ నర్సంపేట రూ.3,116 ఆర్థికసాయం అందించారు.

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ పబ్బతి ప్రతాప్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా చెన్నారావుపేట ఆటో యూనియన్ అధ్యక్షుడు బండారి సత్యంగౌడ్, గౌరవ అధ్యక్షులు కంది కృష్ణారెడ్డి, సిద్ద ఉపేందర్‌లు బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. అనంతరం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. నాంపెల్లి సంపత్, ముదురుకోళ్ల భిక్షపతి, సాధు రాజు, కొట్టం మోహన్, ఉప్పుల రాజు, చిన్నయ్య, సభ్యులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు బానోత్ లకుపతి తల్లి ఝూమల్లి బుధవారం మృతిచెందింది. కాగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఝూమల్లి మృతదేహం వద్ద పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు చిర్ర మల్లయ్య, మందాటి సుదర్శన్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, దురిశెట్టి రాజు, నర్సింహమూర్తి, యాకుబ్‌రెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా ఎల్లయ్య మృతదేహంపై మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ముస్తఫా, నాయకులు నర్సింహ, కుమారస్వామి పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి కృషి

ఖానాపురం : విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని హెచ్ఎం రమేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని బాలుతండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సంపూర్ణ బదిలీ కాగా బుధవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న సందర్భంగా సంపూర్ణ విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులుల అంకితభావంతో పని చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించాలంటే తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందన్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


వర్గీకరణను అమలు చేయాలి

గీసుకొండ : సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఎస్సీ ఏ,బీ,సీ,డీల వర్గీకరణను వెంటనే రాష్ట్రంలో అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈమేరకు గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంటలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం పాలాభిషేకం చేశారు. దళితరత్న కేదాసి మోహన్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ నమిండ్ల క్లైమెంట్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ముల భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

రైతు ధర్నాను విజయవంతం చేయాలి

దుగ్గొండి /చెన్నారావుపేట : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నేడు(గురువారం) నిర్వహించే రైతు ధర్నాను విజయవంతం చేయాలని యువజన నాయకుడు కంది కృష్ణచైతన్య రెడ్డి, దుగ్గొండి మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు బుధవారం ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



దుగ్గొండి : మండలంలోని దేశాయిపల్లి శివారు శంభయ్యపల్లిలో బుధవారం పోచమ్మ బోనాలను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన బోనాలతో శివసత్తులు నృత్యాలు చేశారు.

రాయపర్తి : గ్రామ దేవతలైన మారెమ్మ, ముత్యాలమ్మలకు బుధవారం స్థానికులు బోనాలు సమర్పించారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్‌కాలనీ వాసులు బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధన చేయాలి

● డీఐఈఓ శ్రీధర్‌సుమన్


రికార్డులను తనిఖీ చేస్తున్న శ్రీధర్‌సుమన్

నెక్కొండ : ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని డీఐఈఓ శ్రీధర్‌సుమన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవికాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలల్లో అడ్మిషన్లతో పాటు విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఆయన సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒకేషనల్ విద్యకు ఆదరణ ఉందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతగానో దోహదపడనుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు తక్కువ కాలంలో తక్కువ ఖర్చుతో తొందరగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్న ఒకేషనల్ ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ రెండేళ్లలో పూర్తి చేయవచ్చని ఆయన వివరించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కరుణశ్రీ, శ్రీవికాస్ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ తాటిపర్తి అంజన్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆనందరావు, కొత్త మధుకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగునీరు నిల్వకుండా చూడాలి


దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

నెక్కొండ : ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వకుండా చూడాలని నర్సంపేట సబ్ యూనిట్ మలేరియా అధికారి బి.నందా అన్నారు. మండలంలోని అలంకానిపేట పీహెచ్‌సీ పరిధిలోని పెద్దకొర్పోలు గ్రామంలో బుధవారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా నందా మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామానికి చెందిన దయ్యాల మల్లయ్య డెంగీ బారిన పడిన విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు దోమల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. డెంగీ కేసులు పెరగకుండా వైద్యసిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గ్రామంలో జర్వ పీడితుల వివరాలను వైద్యసిబ్బంది సేకరించారు.వైద్యురాలు సుధ, ఏఎన్ఎం కరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

పర్వతగిరి : గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటించాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ పి.శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుదాం ఒక చెట్టు -అమ్మ పేరు మీద(ఏక్ పేడ్-మాకే నామ్) కార్యక్రమంలో భాగంగా నేడు(గురువారం) గ్రామాల్లో గ్రామస్థాయి అధికారులు, స్థానికులు, మహిళల సంఘాల సభ్యులు, స్కూల్ విద్యార్థులతో మొక్కలు నాటించాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, రెండు గుంతలు ఉండాలని ఆదేశించారు. ఓటర్ లిస్టు మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఓ సుశీల్‌కుమార్, ఈసీ కె.రాజు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రవీందర్‌రెడ్డి

నల్లబెల్లి : పీఆర్‌టీయూ టీఎస్ ఎన్నికల్లో గెలుపొందిన నాయకులు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్ రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశం హాల్‌లో బుధవారం నిర్వహించారు. సరస్వతి చిత్రపటానికి అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. మొదటగా ప్రధాన కార్యదర్శి ఉడుత రాజేందర్ తన నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ బడుల బలోపేతం, విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రజల భాగస్వామ్యంతో పీఆర్‌టీయూ, ఉపాధ్యాయులు పాటుపడుతూ ఆదర్శంగా నిలవాలని కోరారు. అనంతరం ఎన్నికల అధికారిగా ఆవునూరి రవీందర్ వ్యవహరిస్తూ ఆ సంఘం నూతన మండల కమిటీ ఎన్నికలను నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా రెండోసారి నక్కిరెడ్డి మహేందర్ ఎన్నికైనట్లు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా ఉడుత రాజేందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా బానోత్ కృష్ణ, ఉపాధ్యక్షుడిగా బాలు, మహిళా ఉపాధ్యక్షురాలిగా పోరెడ్డి లక్ష్మీదేవి, మహిళ కార్యదర్శిగా ఎ.అరుణ, కార్యదర్శిగా మాలోత్ వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్, ఎస్‌వీఆర్ రాజు, ఎన్నికల పరిశీలకులు శ్రీనివాస్, కల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీడీపీఓ సేవలు మరువలేనివి

నర్సంపేట : నర్సంపేట ఐసీడీఎస్ సీడీపీఓగా బదిలీపై వచ్చిన మధురిమను హనుమకొండ జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు పట్టణంలోని రైతు వేదికలో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి శాలువాతో సత్కరించారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు దామెర నర్సయ్య, ప్రధాన కార్యదర్శి తేరాల యుగంధర్‌లు మాట్లాడుతూ హనుమకొండలో జిల్లా సంక్షేమ అధికారిగా ఉన్న సమయంలో మధురిమ సీనియర్ సిటిజన్స్ కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారని తెలిపారు.

బదిలీలు సహజం

పర్వతగిరి : ఉద్యోగ నిర్వహణలో ప్రతీ ఉద్యోగికి బదిలీలు సహజమని ఎంపీడీఓ ఎం.శంకర్‌నాయక్ అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో పని చేసి బదిలీపై వెళ్లిన కార్యాలయ సూపరింటెండెంట్ అయేషాపర్వీన్, కొంకపాక, రోళ్లకల్ కార్యదర్శులు హుస్సేన్, చిరంజీవిలను బుధవారం శాలువాతో సన్మానించి సత్కరించారు.

గుప్తనిధులు ఉన్నాయని తవ్వకాలు?

చెన్నారావుపేట : గుప్తనిధుల కోసం ఓ ఇంట్లో తవ్వకాలు జరిపిన ఘటన పాపయ్యపేట గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. చీనూరి యాకయ్య ఇంట్లో గుప్తనిధులు ఉన్నాయని కొందరు భూత వైద్యులు తెలుపడంతో మంగళవారం రాత్రి తవ్వకాలు నిర్వహించారు. అలాగే బుధవారం ఉదయం కూడా తవ్వకాలు చేపట్టాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్సై గూడ అరుణ్ పోలీస్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు గుర్తించారు. తవ్వకాల్లో గుప్త నిధులు బయటపడ్డాయా లేదా అనే వివరాలు తెలియాల్సి ఉంది. తవ్వకాలకు సంబంధించిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విరాళం అందజేత

వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లిలో హనుమాన్ ఆలయ పునఃనిర్మాణానికి జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ బుధవారం రూ.11,116 విరాళం అందజేశారు. కమిటీ సభ్యులు దోమకొండ శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్వర్లు, బొజ్జ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాపన్న జయంతిని విజయవంతం చేయాలి

నర్సంపేట : పట్టణంలోని పాపన్న సెంటర్‌లో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమం ఈనెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఏసీపీ ఎల్.కిరణ్‌కుమార్‌లను బుధవారం జయంతి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్ మాట్లాడారు.ఉదయం 10గంటలకు బైక్ ర్యాలీ అనంతరం పాపన్నగౌడ్ విగ్రహం వద్ద 11గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. గౌడ కులస్తులు హాజరై పాపన్న జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, సెక్రటరీ జనరల్ రాములుగౌడ్ హాజరవుతారని తెలిపారు. గోపగాని వెంకట్‌గౌడ్, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.